మురుగుపాలిటీలు!

- చినుకుపడితే చెరువుల్లా రోడ్లు
- పట్టణాల్లో డ్రైన్లపై అక్రమ నిర్మాణాలు
- పూడికల తొలగింపునకు ఆటంకాలు
- ఏళ్లు గడుస్తున్నా కొనసాగుతున్న సమస్య


పెద్దాపురం సారా వారి వీధిలో వర్షం వస్తే వాహనదారుల ఇక్కట్లు ఇవి.. (ఫైల్)

పెద్దాపురం: పేరులో మున్సిపాలిటీస్థాయి. వాస్తవానికి మురుగుపాలిటీలుగా పేరు గడించాయి. చినుకు పడితే రహదారులు వాగులుగా మారిపోతాయి. పెద్దాపురం, పిఠాపురం నియోజకవర్గాల పరిధిలోని పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం పురపాలక రహదారులతో పాటు గొల్లప్రోలు నగర పంచాయతీల్లోనూ రహదారులు మురుగుకూపాలను తలపిస్తున్నాయి. ప్రధానంగా ఆయా మున్సిపాలిటీల్లో డ్రైన్లపై అక్రమ నిర్మాణాలు, వాటికి తోడు వాటిలో పేరుకుపోయిన సిల్టు తొలగించకపోవడంతో చిన్నపాటి చినుకుకే డ్రైన్లు పొంగి పొర్లుతుంటాయి.

పెద్దాపురం మున్సిపాలిటీలో..

ఓ మోస్తారు వర్షానికే ఫ్లీడర్స్ వీధి నుంచి దర్గా సెంటర్‌కు వచ్చే మార్గం చెరువులా మారి వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతుంటారు. వాహనాల ఇంజిన్లలోకి నీరు చేరి మరమ్మతులకు గురవుతుంటాయి. దర్గా సెంటర్‌లో కాలువపై వెలసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వ్యర్థాలు ఈ కాలువలోనే వేయడంతో వర్షపు నీటితో కలిసిన మురుగునీరు రోడ్డుపై పారుతూ దుర్వాసన వెదజల్లుతుంటుంది. ఫ్లీడర్స్ వీధికి వెళ్ళే ప్రాంతంలోనే ప్రధాన బ్యాంక్‌లు ఉండడంతో ఈ పరిస్థితుల్లో ఖాతాదారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సామర్లకోటలో..

సామర్లకోట అర్బన్ పరిధిలో స్థానిక జయలక్ష్మి థియేటర్ రోడ్డు, రథం సెంటర్ ప్రాంతాల్లో చినుకుపడితే మురుగు రోడ్డుపైకి వచ్చేస్తుంది. ఈ పరిస్థితి కారణం ఇక్కడ కూడా డ్రైన్లపై ఉన్న అక్రమ నిర్మాణాలే. నిర్మించిన డ్రైన్లకు మురుగు పోయేలా చిన్నపాటి రంధ్రాన్ని చేయకపోవడం గమనార్హం.

పిఠాపురం మున్సిపాలిటీలో..

పిఠాపురం మున్సిపాలిటీలో పలు రహదారులు రాజా వారి చెరువు చేపలు మాదిరి వర్షపు నీటి నిల్వలతో మురుగు రహదారులపై పారుతోంది. ప్రధానంగా మార్కెట్ సెంటర్, ఉప్పాడ సెంటర్, పాదగయ సెంటర్ వద్ద డ్రైన్లు వర్షం వస్తే మురుగుతో నిండిపోతున్నాయి.

గొల్లప్రోలు నగర పంచాయతీలో..

గొల్లప్రోలు నగర పంచాయతీలో సైతం పారిశుధ్యం క్షీణించింది. చినుకుపడితే చాలు ప్రధాన రహదారి మురుగుకూపంలా మారుతోంది. జాతీయ రహదారి పైనుంచి వచ్చే వాహనాల వల్ల గొల్లప్రోలు గ్రామంలోని హైస్కూల్ వద్ద, ప్రధాన సెంటర్‌లో పూర్తిగా ధ్వంసమైంది. వీధుల్లో డ్రైన్లు పొంగిపొర్లుతున్నాయి. వీటి వల్ల వాహనచోదకులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు.


ఆటో మొబైల్ దుకాణం వద్ద నిలిచిపోయిన మురుగునీరు


దర్గాసెంటర్‌లో మురుగు నీటి వ్యర్థాలను తరలిస్తున్న సిబ్బంది

ప్రజల కష్టాలు తీరేదారేదీ

పురపాలక ప్రజల కష్టాలు తీర్చాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఆయా మున్సిపాల్టిల్లో డ్రెయిన్లపై అక్రమ నిర్మాణాలు సాగుతున్నా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చోద్యం చూస్తున్నారు. ఎవరి సిఫార్సులు వారికి ఉండడంతో డ్రైన్లపై అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. దీంతో పూడికలు తీసే వీలు లేక పారిశుద్య సిబ్బంది నానా అవస్థలు పడుతూ, కొన్ని చోట్ల వదిలేస్తున్నారు.

ఇబ్బందులు వర్ణనాతీతం



చినుకపడితే చాలు మా ఇబ్బందులు మామూలుగా ఉండవు. సారా వారి వీధిలో వర్షం వచ్చినప్పుడు ఆ దారిలో వెళ్లాలంటే మోకాళ్ల లోతు మురుగునీటిలోనే ప్రయాణించాల్సిన పరిస్థితి. వర్షం వచ్చేటప్పుడు మా దుకాణం వద్దే నీరు నిలిచిపోతుంది. కాబట్టి ఆ రోజు దుకాణాన్ని మూసేయాల్సిన పరిస్థితి.

– **చవ్వాకుల సత్యం,** ఆటో మొబైల్ దుకాణ యజమాని, సారా వారి వీధి, పెద్దాపురం

వర్షం వచ్చినప్పుడు అమ్మ ఇంటికి రావాలంటే ఇబ్బందే



వర్షాకాలంలో మా అమ్మగారి ఇంటికి గొల్లప్రోలు రావాలంటే నరకమే. ఏ దారిలో వెళ్ళాలన్నా మురుగునీటి నుంచే వెళ్లాలి. డ్రైన్ల పూడిక ఎందుకు తియ్యరో తెలియదు గాని ఓ మోస్తారు వర్షానికే గొల్లప్రోలు మునిగిపోతుంది.

– **సుందరపల్లి నాగలక్ష్మి,** గృహిణి, గొల్లప్రోలు

అక్రమ కట్టడాలపై చర్యలు



పట్టణ పరిధిలో డ్రైన్లపై అక్రమ నిర్మాణాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే చాలా మందికి నోటీసులు ఇచ్చాం. వర్షం వస్తే పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో ఇబ్బందులు ఉన్నాయి. వాటి పరిష్కారానికి చర్యలు చేపడతాం.

– **కె.వి.పద్మావతి,** మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

క్లుప్తంగా

దవులూరి పరామర్శ


గోపు వెంకటేశ్వరరావును పరామర్శించిన దొరబాబు తదితరులు

పెద్దాపురం: మండలంలోని చదలాడ గ్రామంలో ఇటీవల మృతి చెందిన మైనర్ బాలుడు ఆవాల శ్రీనివాస్ కుటుంబాన్ని శనివారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు పరామర్శించారు. అనారోగ్యంతో పిన్న వయస్సులోనే ప్రాణాలు కోల్పోయిన కుటుంబాన్ని పరామర్శించి బాలుడు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మండల యూత్ కన్వీనర్ గోపు మురళి తదితరలున్నారు.

దుర్గాభవాని కుటుంబానికి పరామర్శ

సామర్లకోట: ఇటీవల మృతి చెందిన మాజీ కౌన్సిలర్ గోపు దుర్గాభవాని కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు శనివారం పరామర్శించారు. మృతురాలి భర్త వెంకటేశ్వరరావును పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయ ణ, పట్టణ అధ్యక్షుడు మద్దాల శ్రీను, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



సదస్సులో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శేషుబాబ్జీ

పెద్దాపురం: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా నాయకుడు దువ్వా శేషుబాబ్జీ అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శనివారం ఆంధ్రప్రదేశ్ కేంద్ర బడ్జెట్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో శేషుబాబ్జి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కి కేవలం 15 వేల కోట్లు అప్పుగా ఇవ్వడంపై ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ బడ్జెట్ బాగుందని ఎలా చెప్పగలుగుతున్నారన్నారు. మన రాష్ట్రానికి రావాల్సిన వాటాలను తెచ్చుకోవడంలో ఏపీ ఎంపీలు ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు, సిరిపురపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిల వసూళ్లకు చర్యలు


బకాయి ఉన్న దుకాణాలకు సీలు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో మొండి బకాయిలు ఉన్న దుకాణాలపై చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. ఈ మేరకు స్థానిక స్టేషన్ సెంటర్‌లో బకాయిలు ఉన్న షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు ఇచ్చినా స్పందించని వారిపై చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మొండి బకాయిలు ఉన్న షాపులకు సీలు వేసినట్టు మున్సిపల్ అధికారులు చెప్పారు.

బ్లేడుతో యువకుడి హల్‌చల్


సాలిపేట ఎంపీపీ పాఠశాల వద్ద ఉన్న యువకుడు

కొత్తపల్లి: అమీనాబాద్‌లో ఒక యువకుడు బ్లేడుతో హల్‌చల్ చేస్తున్నాడు. దీంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. సాలిపేటలో ఉన్న ఎంపీపీ పాఠశాల వద్ద సాయంత్రం విద్యార్థులు ఇంటికి వెళ్లే సమయంలో ఆ యువకుడు బ్లేడుతో గేటు వద్ద నిలుచుండడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. మందలించిన ఉపాధ్యాయులపై బ్లేడుతో దాడి చేసేందుకు ప్రయత్నించాడని స్థానికులు చెబుతున్నారు. దీనిపై కొత్తపల్లి పోలీసులను వివరణ కోరగా ఈ విషయాన్ని స్థానికులు తమ దృష్టికి తీసుకువచ్చారని ఆ యువకుడిను మందలించినట్టు తెలిపారు.

పిఠాపురంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం రద్దు

పిఠాపురం: జిల్లా స్థాయిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ హాలులో ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ఈ సోమవారం పిఠాపురంలో జరిగే నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం రద్దు చేసినట్టు తెలిపారు. అయితే మండల స్థాయి కార్యక్రమం యథావిధిగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు జరుగుతుందన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు.

వాహనాలు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీ కొనడంతో శనివారం రాత్రి ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు మార్జిన్‌లో లారీలు నిలిపి ఉండడం వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక పోవడంతో మోటారు సైకిళ్లు ఢీకొన్నాయి. దాంతో ప్రసన్నాంజనేయనగర్‌కు చెందిన రాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతనిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

తల్లిపాలే శ్రేయస్కరం

కొత్తపల్లి: అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలే శ్రేయస్కరమని సెక్టార్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి అన్నారు. ఉప్పాడలో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. మొదటి ఆరు నెలలు తల్లి పాలు మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆహారమని, ఏటువంటి ఆహారం అందించకూడదన్నారు. తల్లిపాలు ఇచ్చే వారిలో గర్భాశయ, అండాశయ రొమ్ముల్లో క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

16 నుంచి నవదుర్గ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు


వివరాలు వెల్లడిస్తున్న విజయలక్ష్మి

సామర్లకోట: నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన నవదుర్గా సమేత దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి అష్ట లక్ష్మీ సహిత వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ వ్యవస్థాపకురాలు కనక విజయలక్ష్మికి కలలో కనిపించిన మేరకు సుమారు 55 ఏళ్ల క్రితం నిర్మించిన ఆలయం నేడు ఒక పుణ్య క్షేత్రంగా మారింది. 16వ తేదీ ఉదయం వరలక్ష్మీ వ్రతాలతో పాటు 8 మంది ముత్తైదువులతో అష్టలక్ష్మీ పూజలు నిర్వహించనున్నారు. సామూహిక వ్రతాల్లో పాల్గొనే 2,024 మందికి భోజనాలు పెట్టి వాయన సత్కారం చేస్తారు. 316 మందికి ముత్తైదువులకు డ్రా ద్వారా చీరలు ఇవ్వడం జరుగుతుందని దేవిపుత్రిక చెప్పారు. అదే రోజు మధ్యాహ్నం దుర్గామల్లేశ్వర స్వామికి దివ్య కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు సత్తిరాజు తెలిపారు.

పొలంబడిని రైతులు వినియోగించుకునేలా చూడండి


చేబ్రోలులో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పిఠాపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలంబడిని వినియోగించుకుని మంచి దిగుబడి సాధించేలా రైతులకు సహకరించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు భ్రమరాంబ వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. శనివారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొని మండలంలోని రైతు సేవ కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పలు సూచనలు సలహాలు అందజేశారు. పొలంబడి కార్యక్రమం 14 వారాలు చేయాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు మండల వ్యవసాయాధికారి కె.వి.వి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రాపై అవగాహన లేని మహిళలెందరో


సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు రమణి

- వారిని రాజకీయంగా వాడుకుంటున్న పార్టీలు
- చైతన్యం నింపడంలో చిత్తశుద్ధి కరవు
- ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రమణి
- సుందరయ్య భవన్‌లో అవగాహన సదస్సు

కాకినాడ సిటీ: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో కాకినాడ సుందరయ్యభవన్‌లో డ్వాక్రా సంఘాల నిర్వహణపై శనివారం అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సీహెచ్ రమణి మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల నిర్వహణపై మెజారిటీ మహిళలకు అవగాహన లేకపోవడం వల్ల నష్టపోతున్నారన్నారు. ఏ ప్రభుత్వమైనా రాజకీయ సమావేశాలకు ఉపయోగించుకోవడం తప్ప వారిలో చైతన్యాన్ని నింపే చిత్తశుద్ధి లేకపోవడం బాధాకరమన్నారు. వారు దాచుకున్న పొదుపు సొమ్ముపై వారి హక్కు అనే విషయం తెలియకుండా ఉన్నారన్నారు. అందుకే బ్యాంకు వారు వారి సొమ్ము లోన్‌గా తీసుకోకుండా అడ్డు చెప్తున్నప్పటికీ మాట్లాడడం లేదన్నారు. గ్రూపులు ఏర్పాటు చేసింది మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ అవగాహన కల్పించడం కోసమని ప్రభుత్వాలు మరచిపోయాయని రమణి విమర్శించారు. వారికి అవగాహన కల్పించే చర్యలు చేపట్టాలని ఐద్వా డిమాండ్ చేసింది. అన్ని జిల్లాల్లో డ్వాక్రా గ్రూపులపై సర్వే నిర్వహించి వచ్చిన సమస్యలపై రాష్ట్ర జిల్లా అధికారులకు వినతి పత్రాల ద్వారా తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి, నాయకులు జి.గంగాభవాని, ఐ.దుర్గా, కె.మణి, పి.లావణ్య, జె.వెంకటలక్ష్మి, కె.ఈశ్వరి, సీహెచ్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపిస్టు సేవలు అభినందనీయం

కరప: దివ్యాంగ పిల్లలకు ఓర్పు, సహనంతో వ్యాయామాలు చేయిస్తూ, అందించిన సేవలు అభినందనీయమని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎంఎం మారుతి పెదపూడి మండలానికి బదిలీపై వెళుతున్న సందర్భంగా శనివారం దివ్యాంగులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మారుతిని ఎంఈఓలు బుల్లికృష్ణవేణి, సత్యనారాయణ, హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. ఐఈఆర్‌పీలు కె.స్వాతి, ఎన్.మల్లేశ్వరి, కేర్ టేకర్ డి.తనూజ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు మేలు


అంబేడ్కర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న నేతలు

పిఠాపురం: ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు మేలు జరుగుతుందని పిఠాపురం బీజేపీ నేతలు సుప్రీం కోర్ట్ ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు. పిఠాపురం జీవన్‌నగర్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు శనివారం పూల మాల వేసి బీజేపీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల సూర్యనారాయణరాజు, గండి కొండలరావు, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, స్వచ్ఛభారత్ స్టేట్ కో–కన్వీనర్ బుర్రి మురళీధర్‌రావు సీనియర్ నాయకులు మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తోట ఏడుకొండలు, జిల్లా స్వచ్ఛభారత్ కన్వీనర్ ఓలేటి వెంకటేశ్వరరావు, పట్టణ ఉపాధ్యక్షుడు లింగంపల్లి రవీంద్ర బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు బండే శ్రీనివాస్, దొడ్డు లక్ష్మీనారాయణ, వరద బ్రహ్మాజీ, కె.నరసరావు, నాయకులు పాల్గొన్నారు.

తిరుమలలోని వెయ్యికాళ్ల మండపాన్ని పునర్నిర్మించాలి

బోట్‌క్లబ్: తిరుమలలో వెయ్యి కాళ్ళ మండపాన్ని పునఃనిర్మించాలని భోగిగణపతి పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. శనివారం ఉదయం సుప్రభాత వేళలో పీఠం ప్రాంగణంలోని తిరుమల శ్రీవారి పాదాల వద్ద గోవిందుని 43వ సహస్ర నామ జపయజ్ఞ పారాయణలో సంకీర్తన నిర్వహించారు. తిరుమలలో వెయ్యి కాళ్ల మండపాన్ని తొలగించి మరోచోట నిర్మించాలని ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదన్నారు. సంస్కృతి సంప్రదాయాలను పూర్వకట్టడాల ప్రాచీన వారసత్వ సంపదను పరిరక్షించాలన్నారు.

రొయ్యల శుద్ధి పరిశ్రమలో అగ్ని ప్రమాదం


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన సామగ్రి

కొత్తపల్లి: ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డులో జగనన్న కాలనీ సమీపంలో ఉన్న రొయ్యల శుద్ధి పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపాలెంకు చెందిన వి.ధనబాబు జగనన్న కాలనీ సమీపంలో రొయ్యల శుద్ధి పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. గత 15 రోజులుగా పరిశ్రమలో పనులు నిలిపివేశారు. శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు పరిశ్రమలోకి ప్రవేశించి అగ్ని ప్రమాదానికి కారణమైనట్టు బాధితుడు ఆరోపిస్తున్నాడు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల విలువ చేసే సామన్లు అగ్నికి ఆహుతైనట్టు తెలిపారు. దీనిపై కొత్తపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

గోతులు పూడ్చారు

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: పెద్దాపురం–సామర్లకోట రోడ్డులో ఎస్‌బీఐ వద్ద, పాత పెట్రోలు బంకుకు ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తరుచూ గోతులు పడి చిన్న వాహనాల చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై ఇటీవల సాక్షిలో ప్రచురితమైన 'ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు' అనే కథనానికి ఎమ్మెల్యే చినరాజప్ప స్పందించారు. ఆయన సూచన మేరకు మున్సిపాలిటీ నుంచి రూ.25 లక్షలు మంజూరు చేస్తూ ఇటీవల కౌన్సిల్ తీర్మానించింది. ఈ మేరకు శనివారం గోతులను పూర్తిగా పూడ్చి గోతులలో నిలిచే నీరు రెండో వైపు నుంచి డ్రైన్ లోనికి పోయేలా సెంటర్ డివైడర్ నుంచి మార్గం ఏర్పాటు చేశారు. దాంతో కొంత వరకు సమస్య పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నదని స్థానికులు అంటున్నారు.


సామర్లకోట–పెద్దాపురం రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గోతులు పూడుస్తున్న సిబ్బంది

భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టాలపై అవగాహన



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పిఠాపురం: మహిళలు, బాలల చట్టాల గురించి భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పిఠాపురం ఐసీడీఎస్ అధికారిని సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి సూచించారు. గొల్లప్రోలు మండలం కొడవలిలో శనివారం వంద రోజుల మిషన్ శక్తి అవగాహన కార్యక్రమంలో భాగంగా తల్లిపాల వారోత్సవాలు 7వ వారం ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం, మహిళలు, బాలల చట్టాల గురించి, భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టాల కోసం గర్భిణులకు, బాలింతలకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతన చట్టాలు వాటి వల్ల కలిగే ప్రయోజనాలు వాటిని ఎలా ఉపయోగించుకోవాలి తదితర అంశాలను వివరించారు. చట్టం అమలు కోసం అంతర్గత కమిటీల ఏర్పాటు, ఎవరు సభ్యులుగా ఉంటారు అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పని ప్రదేశాలలో లైంగిక వేధింపులు గురైతే ఏ విధమైన చట్టాలు ఉన్నాయి అనే విషయాలు వివరించారు. ఈ కార్యక్రమం ఐసీడీఎస్ సిబ్బంది పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సూపర్‌వైజర్ నాగమణి, మహిళా శక్తి సభ్యులు ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీ నమోస్తుతే..!


దుర్గాడ గ్రామ దేవత వేగులమ్మ


పిఠాపురం శృంగేరి శంకర మఠం మహాలక్ష్మి అమ్మవారు

పిఠాపురం: ఆషాఢమాసం సందర్భంగా గ్రామ దేవతలు శాకంబరులుగా భక్తులకు దర్శనమిస్తున్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామ దేవత వేగులమ్మ అమ్మవారి శాకంబరి అలంకరణ శనివారం వైభవంగా జరిగింది. గ్రామస్తులు, ఆలయ సేవా సభ్యులు వేగలమ్మ అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు దత్తు సోదరులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, లలితా సహస్ర నామ కుంకుమార్చన నిర్వహించారు. గ్రామము, పరిసర గ్రామాలు సస్య శ్యామలంగా ఉండాలని, జ్వర పీడిత బాధలు లేకుండా సంపూర్ణ ఆరోగ్యంతో భక్తులందరూ కూడా ఉండాలని ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాలు చేస్తున్నట్టు ఆలయ సేవా సభ్యులు తెలియజేశారు.

పిఠాపురంలో

పిఠాపురం శృంగేరి శంకర మఠం మహాలక్ష్మి అమ్మవారు శనివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని వివిధ కూరగాయలు, పండ్లతో అలంకరణ చేశారు.

అవయవదానంతో ప్రాణదానం

కాకినాడ రూరల్: రోడ్డు ప్రమాదాలు తదితర కారణాలతో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలను అవసరమైన వారికి అమర్చడం ద్వారా ప్రాణదాతలు అవుతారని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జాతీయ అవయవ దినోత్సవాన్ని నిర్వహించారు. కాలేయం, మూత్రపిండాలు, పేగులు, ఊపిరితిత్తులు, గుండె, ప్రాంక్రియాసిస్ వంటి అవయవ దానాలతో 8 మంది ప్రాణాలను కాపాడువచ్చన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ శిరీష, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.